# అమ్మతోడు చాలునాకు

తల్లి బ్యాంకు ఉద్యోగిని. కూతురు కంప్యూటర్ కంపెనీ ఉద్యోగిని. ఇద్దరూ ఉదయం తొమ్మిది గంటలకల్లా కూతురు స్కూటరు మీద తల్లిని కూర్చోపెట్టుకు వెళ్లే అదృశ్యం చూసినపుడల్లా నాకు ఎంతో సంతోషం, గర్వం కలుగుతాయి.

అబ్బ! ఆడవాళ్లెంత ఎదిగారు. మా తరానికి ఈ తరానికి మధ్య ఈ రెండు తరాలలో ఎంత మార్పు, ప్రగతి సాధించారు. మా రోజుల్లో మాకిలాంటి అవకాశాలెక్కడున్నాయి! ఈనాటి అమ్మాయిల మొఖాలలో కన్పించే తెలివి, ఆత్మవిశ్వాసం, పట్టుదల మెచ్చూరిటీ చూసినప్పుడు అబ్బాయిలతో సరిసమానస్థాయికి ఎదిగారు అని సంతోషం కలుగుతుంది.

మా అపార్ట్‌మెంట్ పక్క అపార్ట్‌మెంట్ వారిది. ఓ టూ బెడ్ రూము ఫ్లాట్‌లో వుంటారు తల్లికూతురు. తండ్రి వున్నాడో లేడో తెలియదు. వాళ్లసంగతి వాళ్లది తప్ప వారెవరితో మాట్లాడగా చూడలేదు ఎప్పుడూ - రెండు మూడు సార్లు మెట్లమీదో, లిఫ్ట్‌లోనో, ఏ పాలు తీసుకుంటున్నప్పుడో తప్ప కనపడరు. కనపడినపుడు కాస్త పలకరింపుగా నవ్వితే దానికి ప్రతిస్పందన లేదు పెద్దగా - ఇరుగు పొరుగు వున్నాం ఎప్పుడన్నా ఏదన్నా అవసరం రావచ్చు కాస్త పరిచయం చేసుకుంటే తప్పేం వుంది. వాళ్లు కొత్తగా వచ్చారు కనక నేనే ముందెళ్లి పలకరించడం మర్యాద అని వాళ్ళొచ్చిన ఓ నెల తరువాత ఆదివారం సాయంత్రం పూట వెళ్లి బెల్‌కొట్టాను. నైటీలో వున్న కూతరు తలుపు తీసింది. డైనింగ్ టేబిల్ దగ్గిర తల్లి నైటీలో వుంది. - కూర్చుని కూరలు తరగడం కన్పించింది. కూతరు వెనక్కి తిరిగి అమ్మా, పక్కింటి ఆంటి వచ్చారు. అంది తొంగి చూసి-'రమ్మను' లోపలికి' అంది తల్లి, టేబిల్ మీద నాలుగైదు రకాల కూరలు పెట్టుకు తరుగుతూ ప్లాస్టిక్ డబ్బాలలో నింపి పెట్టుకుంటుంది ఆవిడ. నన్ను చూసి లేచి డైనింగ్ కుర్చీ జరిపి రండి, కూర్చోండి, ఇవాళ ఆదివారం, శెలవు గదా, ఏదో నాలుగు కూరలు తరిగి పెట్టుకుంటే వారానికి సరిపడవుంటాయి" అందావిడ చేతిలో పని ఆపకుండానే.

"అవును, ఉద్యోగస్థులు కదా, టైము ఎడ్జస్ట్ చేసుకోవాలి గదా. మాలాంటి వాళ్లం యింట్లో వుంటాం ఈ ఇబ్బందులు తెలయవు. మీ కసలు టైము వుండదనుకుంటాను బయట ఎక్కడా కనపడనే కనపడరు. యిరుగుపొరుగు కదా బొత్తిగా పరిచయం లేకుండా వుండడం ఏమిటని వచ్చాను. సారీ, నేనేం డిస్టబ్ చేయలేదుగదా' అన్నాను" అబ్బే అదే

లేదు. నాకసలు టైముండదండి ఉదయం వెళ్లితే సాయంత్రం అవుతుంది - మళ్లీ యింట్లో పనులు, అలిసిపోయాక దేనికీ మూడ్ వుండదు ఏదో కాసేపు పేపరు తిరగేసి, టి.వి. దగ్గిర కాసేపు కూర్చునేసరికి కళ్లు మూతలు పడతాయి. యింక దేనిమీద యింటరెస్ట్ వుండదండి' అపాలజిట్‌గా అంది ఆమె. మీరేమిటి, అందరు ఉద్యోగినుల రొటీన్ ఒక లాగే అయిపోయింది'- అన్నాను. కూతురు టి.వి. సౌండ్ తగ్గించి చూస్తూ కూర్చుంది. తల్లికి నలభై ఐదు, కూతురికి యిరవై, యిరవైఐదు మధ్య వుంటుంది వయసు. ఇద్దరూ జుత్తు కత్తిరించుకుని క్లిప్పులు పెట్టుకుని, నైట్‌గౌనులలో వునారు. అక్క చెల్లెళ్ళనుకుంటారు తప్ప తల్లికూతుళ్లనిపించరు. ఇద్దరి ముఖాలు కళగా వున్నాయి. మరీ రంగు కాకపోయినా మంచి శరీరపు కాంతి, మొహంలో సంస్కారం, తెలివి కనిపిస్తున్నాయి.

"మీది బ్యాంకి జాబా. ఎక్కడ ఆఫీసు' - 'సారీ మీ పేరన్న అడగలేదు-' రమణి' అంది కెనరా బ్యాంకు, బషీర్‌బాగ్ బ్రాంచి - శ్వేత ఆంటికి టీ.." అంది.

"వద్దండి యిప్పుడే తాగివచ్చాను"

'పోనీ సరే కూల్‌డ్రింక్, శ్వేత ఫ్రిజ్‌లో ఫాంటా వుంది చూసి యియ్యి' అంది. శ్వేత లేచి ఓ ప్లేటులో మిక్చర్, బిస్కట్లు ఫాంటా గ్లాసులో పోసి తెచ్చి టేబుల్ మీద పెట్టింది' నీ ఉద్యోగం ఎక్కడమ్మా- ఏం చేస్తున్నావు' పలకరించాను.

'కంప్యూటర్ ఎనాలిసిస్ట్‌గా..." ఏదో కంపెనీని పేరు చెప్పి మళ్ళీ వెళ్ళి టి.వి. ముందు కూర్చుంది.

'ఎప్పుడన్నా శెలవు పూట రండి, కాస్త పరిచయాలు పెంచుకుంటే యిరుగుపొరుగు అవసరాలుంటాయి'

'అవుననుకోండి. శనివారం ఆఫ్‌డే, ఆదివారం తలంట్లు, వాషింగ్ మెషీన్‌లో బట్టలు, నాలుగైదు రోజులకి కూరలు తరగడం, వంటిల్లు సర్దుకోవడం. శెలవొస్తే అసలు తీరిక వుండందండి..' అంది రమణి. ఇంట్లో మగవాళ్లున్న జాడలేదు. భర్త గురించి అడిగితే ఆయన వున్నాడో, లేదో, విడాకో కాదో ఈ రోజుల్లో చూసి చెప్పలేం. అడిగితే ఏమనుకుంటుందో అయినా మొదటి పరిచయంలోనే అన్నీ ఒకసారెందుకులే అనిపించింది. కూరలన్నీ తరగి నీట్‌గా ప్లాస్టిక్ డబ్బాలకెత్తి ఫ్రిజ్‌లో పెట్టింది. ఇల్లంతా ఎక్కడి వస్తువులక్కడ పొందికగా సర్దివున్నాయి. ప్రతి యింట్లో వుండే టి.వి. సోఫా, డైనింగ్ టేబులు, ఫ్రిజ్ వగైరాలతో పాటు కాస్త ఆర్టిస్టిక్‌గా కొన్ని క్యూరీస్, గోడలకి మంచి కలక్షన్ ఫోటోలు వున్నాయి. తల్లికూతురు యిద్దరు టేస్ట్ వున్నవాళ్లే అనిపిస్తుంది.

పని ఆపకుండా మాటలాడుతూనే ఆవిడ కొబ్బరి కూడా తరిగి ఓ డబ్బాలో పెట్టేసింది. ఆవిడ పని తీరు ముచ్చటేసింది.

ఓ అరగంట కూర్చుని లేచి వచ్చేస్తూ 'రండి ఎప్పుడన్నా ఫర్ ఛేంజ్' అన్నాను. నవ్వింది. కూతురు లేచి గుమ్మందాకా వచ్చి 'బై' అంటీ అని తలుపేసింది.

తరువాత వాళ్ళిద్దరూ రానూలేదు. మళ్ళీ కలవనూ లేదు.

రెండు మూడు నెలల తరువాత ఓ రోజు బెడ్‌రూము బాల్కనీలో బట్టలు ఆరేస్తుంటే మగగొంతు కేకలు వినిపించాయి. తల్లి, కూతుళ్ల గొంతుకలు, వాగ్వివాదాలు వినిపించాయి కాని విషయం స్పష్టంగా వినపడలేదు. ఎవరో ఏమిటో గొడవేమిటో అన్పించినా కల్పించుకునేంత పరిచయం లేదు గదా!

మరో పదిరోజుల తరువాత ఆదివారం పూట పేపర్లు వాడికి డబ్బులిస్తుంటే పక్కింటి దగ్గిర ఎవరో ఒకతను నిల్చుని బెల్‌కొడ్తున్నాడు. తలుపుతీసినావిడ యితన్ని చూసి చటుక్కున తలుపు మూయబోయింది. కాని అతను బలవంతంగా లోపలికి తలుపు నెట్టుకొని ఆవిడ్ని తోసుకుంటూ లోపలికి ప్రవేశించాడు. తలుపు మూసుకుంది. ఆశ్చర్యం అనిపించింది. ఆ రోజు మాటలు, గొంతులు హెచ్చుస్థాయిలో వినిపించాయి. తల్లికూతుర్లు అతనితో ఏదో గొడవపడ్తున్నారన్నది మాత్రం అర్థం అయింది. ఆలోచనలు రకరకాలుగా వెళ్లాయి. ఆవిడ భర్త అన్న అనుమానం వచ్చింది. మొగుడుకాక పోతే అంతలా ఆవిడ్ని నెట్టుకుంటూ లోపలికి ఓ మగాడు ఎలా వెళ్తాడు అనిపించింది.

ఆ మాట నిజమేనన్నట్టు మరో పదిపదిహేను రోజులతరువాత ఓ శనివారం సాయంత్రం ఐదు గంటల వేళ శ్వేత పరిగెత్తుకుంటూ గాభరాగా మా ఇంటికి వచ్చి 'ఆంటీ' అమ్మ పడిపోయింది. మాట్లాడటం లేదు ఒక్కసారి రండి' దాదాపేడుస్తున్నట్టుగా అంది. పరిగెత్తినట్టే వెళ్లా అక్కడికి రమణి నేలమీద పడివుంది. వంటిమీద తెలివిలేదు. 'నీళ్ళు పట్రా కాసిని' గాభరాగా అన్నాను ఆవిడ మొహం తిప్పుతూ 'రమణిగారూ' అని పిలిచా. శ్వేత పరిగెత్తి గ్లాసుతో నీళ్లు తెచ్చింది. ఆవిడ మొహం మీద రెండు మూడు సార్లు చల్లాక, కుదిపి కుదిపి లేపాక నెమ్మదిగా కళ్లు విప్పింది. అపుడు చూశా ఆమె పెదాలు చిట్లి రక్తం కారుతుంది- కంటికింద నల్లబడి వాచింది. చెంపమీద వేళ్లమచ్చలు స్పష్టంగా కనిపిచంఅయి. కళ్లు తెరిచి నన్ను చూసి గాభరాగా లేవబోయింది. 'నెమ్మది నెమ్మదిగా' లేచి యిలా మంచంమీద పడుకోండి' ఆవిడ్ని పట్టుకు లేవదీసాను. 'అమ్మా, అమ్మా.. ఎలా వుంది..' శ్వేత ఆరాటంగా తల్లిని పడుకోబెడ్తూ అంది' ఏమిటి ఆంటిని పిలిచావా, ఎందుకనవసరంగా ఆవిడ్ని యిబ్బంది నీర్సంగా అంది. 'భలేవారే, యిబ్బందేవిమిటి, చిన్నపిల్ల, మీరలా తెలివి తప్పిపడిపోతే బెదిరిపోయి పిల్చింది. యిరుగు

పొరుగు అవసరంలో కాకపోతే మరెప్పుడు ఇంతకీ ఈ దెబ్బలేమిటి. రక్తపు చారిక నీళ్లతో తుడుస్తూ అన్నాను. ఆవిడ కళ్లు వాల్చుకుంది. మొహం మ్లానపోయింది. కూతురు మొహం కోపంతో ఎర్రబడింది. 'అమ్మా, నేనీ సారి వూరుకోను ముందు పద పోలీసు స్టేషన్‌కి వెళ్లి రిపోర్టు యిచ్చి వద్దాం. లే...' శ్వేత చాలా కోపంగా అంది. 'ష్... ఆవిడ కళ్లతో వారిస్తూ నా ఎదుట మాట్లాడదన్నట్లు చూసింది.

'పరవాలేదు, తెలియనీ, అందరికీ తెలియాలి. యిలా ఎవరికి తెలుస్తుందో తెలిస్తే అవమానం అనుకుని నోర్మూసుకోబట్టే ఈ మగాళ్లు ఆటలాడుతున్నారు. ఒక్కసారి వెళ్లి పోలీసు రిపోర్టు యిస్తే మళ్లీ మన జోలికి రాడు. నాలుగు రోజులు లాకప్‌లో పడేస్తే రోగం కుదురుతుంది. పద ముందు వెళ్లాలి మనం. ఇంక ఏమయినా సరే నీ మాట వినను'. మొండిగా అంది. 'వుండు బట్టలు మార్చుకువస్తాను'.

శ్వేతా, వూరుకోవే తల్లీ నీకు దండం పెడ్తాను. ఈ రచ్చ కెక్కింది చాలు యింక పోలీసులు గొడవలూను' ఆవిడ విరక్తిగా అంది.

'ఎన్నాళ్లూరుకుంటావమ్మా- నెలకో పదిహేను రోజులలో వచ్చి యిలా గొడవలు పెట్టుకుని తన్నులు తంతుంటే ఎన్నాళ్లు భరిస్తావు' తీక్షణంగా చూస్తూ అంది.

'నా ఖర్మ, ఏం చెయ్యమంటావు. మన పాటికి మనం బతుకుతున్నా నాకీ నరకం తప్పడం లేదు'

'నీవు సహించి పడ్తుంటే ఎలా తప్పుతుంది. అమ్మా నా మాట విను ఒక్కసారి పోలీసు కంప్లైంట్ యిచ్చి చూడు, మళ్లీ నీ జోలికి వస్తాడేమో. ఆంటీ.. మీరన్న అమ్మకి చెప్పండి" వాళ్ళిద్దరి మాటలవల్ల సగం కథ తెల్సినా అసలు సంగతి పూర్తిగా తెలియందే ఏం సలహా యివ్వగలను' ఎవరతను. మీ ఫాదరా ఏమిటసలు గొడవ, ఎందుకు యిలా కొట్టారు. ఏం జరిగింది?...'

'చూడండి ఆంటీ. యింకా మీ దగ్గిర దాచడానికేం వుంది. అతను మా నాన్న.. మా అమ్మనాన్న ఎప్పుడో పదేళ్లక్రితమే విడిపోయారు...

'ఎందుకు...' ఏం జరిగింది. డైవోర్సు పుచ్చుకున్నారా...

'అదో పెద్ద కథ లేండి... పెళ్లయిన పదేళ్లకి ఆయనగారు మరొకరితో ప్రేమలో పడ్డారు. ఏడాది రెండేళ్లు అమ్మ ఎంతో ఓర్పు చూసింది. మారతారన్న ఆశతో. ఆయన ఆవిడ మోజులో పడి ఉద్యోగం కూడా అశ్రద్ధ చేసి మకాం ఏకంగా ఆవిడింట్లోనే పెట్టేశారు. ఏమన్నా అంటే అమ్మని విడాకులు యిమ్మని తాగి వచ్చి తిట్టడం కొట్టడం మొదలు పెట్టారు. పదేళ్ల దాన్ని అంతాతెలియక పోయినా అమ్మని ఆయన పెట్టే

హింస అర్థం అయ్యే వయసు నాకోసం. ఆడపిల్ల భవిష్యత్తు ఆలోచించి అమ్మ ఎంతో చెప్పింది, సహించింది- కానీ ఆయన మారలేదు. డైవోర్సు యిమ్మన్న సాధింపు ఎక్కువయింది. అమ్మ ఆ ఇల్లు తమకి రాసియిస్తే సంతకం పెడతానంది. ఆయన వప్పుకోలేదు. నెలకో రెండు వేలిస్తాడట ముష్టియిచ్చినట్టు. అమ్మ సంతకం చెయ్యను కోర్టుకెళ్ళితే వాళ్లే నిర్ణయిస్తారు అని చెప్పేయడంతో యింకా హింస ఎక్కువయింది. అమ్మ తన ఉద్యోగం చూసుకుని తనని లక్ష్యపెట్టడం లేదని ఆయన కర్థమై ఉద్యోగం వదిలేస్తే యిల్లు రాసిస్తానని బేరాలు మొదలుపెట్టాడు. అమ్మ చేసిన తెలివైన పని ఉద్యోగం మానకపోవడం, లేక పోతే మాగతి ఏమయ్యేదో! అమ్మ తనకి ఏవిధంగానూ లొంగకపోవడంతో కసిగా ఆయన ప్రేయసీనీ యింటికి తీసుకొచ్చి మకాం పెట్టి మానసికంగా అమ్మని ఎంత హింసించాలో అంతా హింసించారు. 'మరి అపుడే మీరు పోలీసులకి కంప్లైంట్ యివ్వవలసింది. అడల్టరీ నేరం కింద ఉద్యోగము ఊడేది. శిక్షపడేది. అప్పటికి ప్రేమ మైకం దిగేది ఆయనకి.'

"అమ్మకంత ధైర్యం ఎక్కడండి-ఏమన్నా అంటే బతుకు బజారున పడేసుకోలేను అంటుంది - యిదిగో ఇలా ఆడవాళ్ల లోకం ఏమనుకుంటుందో, తనకి అవమానం అనుకుంటూసహిస్తారు. భర్తల ఆగడాలు దానివల్లే ఎక్కువవుతాయి. అదే నలుగురిలోకి ఈడ్చి చేసిన ఘనకార్యం చెప్పడమో, శారీరకంగా హింసిస్తున్నట్లు పోలీసులకి చేస్తే రోగాలు కుదురుతాయి. అందరూ మొహాన వుమ్మితే వాళ్ళకి మాత్రం అవమానం కాదా. ఈ ఆడవాళ్లు మారనంతవరకు యిలా ఏడవాల్సిందే".

'సరే, మీరిప్పుడు వేరే వున్నారు గదా. మళ్ళీ మీ దగ్గిర కెందుకు వస్తున్నారు. "అర్థం కాలేదు నాకు".

"అదే గదండి మా బాధ. అమ్మా ఆయనతో బాధలు పడలేక యిల్లు వద్దు ఏ డబ్బు వద్దు అనుకుని అన్ని వదులుకుని నన్ను తీసుకుని వేరే వూరు ట్రాన్స్‌పర్ చేయించుకు వెళ్ళిపోయింది"

'మరింకేమిటి సమస్య - డైవోర్సు యిమ్మని అల్లరా..ఎలాగో విడిగా వుంటున్నారు. ఆ కాగితాల మీద సంతకాలు పెట్టేయరాదూ. ఈ గోలైనా తప్పుతుంది గదా.

'ఎప్పుడో పెట్టానండి' ఆవిడ యింత సేపటికి నోరు వప్పింది- 'ఆయనింక మారడని అర్థం అయ్యాక ఆయన నించి ఏమి కోరకుండానే కాగితం మీద సంతకం పడేశాను. ఏదో నా ఉద్యోగం వుండబట్టి తల్లి కూతుళ్లు గుట్టుగా బతుకుతున్నా కూడా, అలా కూడా బతకనీయకుండా మళ్లీ మా జీవితాలలోకి ప్రవేశించాడు'

'యిప్పుడేం కావాలట.. యిన్నాళ్ల తరువాత మళ్ళీ ఎందుకొచ్చారు?'

"డబ్బు కావాలి. ఆ ప్రేమించినావిడ రెండేళ్ళుండి తెలివిగా యిల్లు తన పేరుపెట్టించుకుంది. అంతవరకు ప్రేమకురిపించి తరువాత ఆయనగారి తాగుళ్లు తందనాలు భరించలేక తన్ని తగిలేసింది. మేం ఇంట్లోంచి వెళ్లడం ఎవర్తినో ఇఆంట్లో తీసుకొచ్చి పెట్టడం. అందరూ అసహ్యించుకుని అంతా దూరమయ్యారు. ఈ వ్యవహారం ఆయన కంపెనీలో కూడా తెలిసి ఈయన తాగుడు వ్యవహారం కారణం చూసి ఉద్యోగం పీకేశారు. అప్పటినుంచి ఎక్కడ సరి అయిన ఉద్యోగం లేక చేసిన రెండు నెలలు మూడు నెలలు చేస్తూండడం ఉద్యోగం పూడుతుండడం, తాగుడు మరీ ఎక్కువై చూసేవారు లేక, డబ్బులు లేక రోడ్డున పడింది బతుకు. అపుడు మళ్లీ మేం గుర్తువచ్చాం. బ్యాంకులో నా చిరునామా ఎవరికి యివ్వద్దని చెప్పాను. ఎలాగో పట్టుకుని మూడేళ్లక్రితం వచ్చి కాళ్లమీద పడినంత పనిచేసి జరిగింది మర్చిపోదాం. మీరు లేకుండా బతకలేను. బుద్ధి గడ్డితిని ప్రేమనుకుని మోసపోయాను. అంటూ మొదలు పెట్టాడు. చెడిన కాపురం చెడింది, వూర్లో అందరికి ఎలాగో తెల్సింది. మమ్మల్ని మా ఖర్మానికి వదిలేసిన ఆయన మాటలకి కరగలేదు.

'అమ్మ కాస్త మెత్తపడబోయింది. నేనే చచ్చినా వప్పుకోలేదు. యిన్నాళ్ళు మా అతీగతి పట్టించుకోలేదు. మా అమ్మని ఎన్నో రకాలుగా హింసించాడు. అలాంటి వాడిని ఎంతమాత్రం దగ్గరికి రానీయవద్దన్నాను. ఒక స్టేజిలో అయితే నీకు కూతురు కావాలో మొగుడు కావాలో తేల్చుకోమని చెప్పేశాను. నేను మేజర్ని అయ్యాను. నీకు మొగుడు కావలిస్తే నా బతుకు నేను బతకగలను అని కూడా అమ్మకి చెప్పాను'.

"నేను మెత్తపడలేదుగాని,'ఆడపిల్ల పెళ్లిడుకొచ్చింది. ఏ సంబంధం-వాళ్లైనా' అడిగే మొదటి ప్రశ్న తండ్రి ఏడనే గదా అడుగుతారు. ఏదో పిల్ల పెళ్లికోసం అని ఒక్కక్షణం కాస్త మెత్తపడ్డానంతే..." ఆవిడ కళ్లు వాల్చుకు అంది.

'అదే, అదే ఈ బలహీనతలే మగవాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. నా పెళ్లి కోసం అని నీవేంత్యాగాలు చేసి తాగుబోతు మొగుడ్ని యింట్లో పెట్టుకుని తన్నులు తినక్కరలేదని గట్టిగా చెప్పాను. 'ఉద్రేకంగా అంది శ్వేత'.

'చిన్నతనం- ఉద్రేకం తప్ప ఆలోచన లేదు దీనికి. సమాజంలో వున్నప్పుడు కొన్ని సమస్యలు ఎదుర్కోక తప్పదుగదండీ. తండ్రి వదిలేసినా తల్లి వదిలేసినా తండ్రిలేని ఆడపిల్ల సంబంధం అనగానే ప్రతివాళ్లు ఓ క్షణం ఆలోచిస్తారన్నది ఈ కాలం పిల్లలకి అర్థంగాదు..."

"నాకేం అర్థం కానక్కరలేదు. నన్ను కావాలనుకునేవాడు యివన్నీ చూసుకొనివాడు, అయితేనే చేసుకుంటాను. నాతోపాటు నిన్ను అంగీకరించిన వాడు దొరకితేనే చేసుకుంటాను.

'అది కాదమ్మా.. యిప్పుడేదో చిన్నతనం వుడుకురక్తం అలా అంటావుగాని, మీ అమ్మ అన్నదానిలో నిజం వుందమ్మా. మనం ఎంత మారాం అనుకున్నా పెళ్లి అనే సరికి సాంప్రదాయాలనే పాటిస్తారమ్మా..'

'అంటీ, మీరు కూడా యిలా మాట్లాడి అమ్మకింకా పిరికిమందుపోయకండి' తీవ్రంగా అంది.

'లోకం గురించి తెల్సిన ఎవరయినా యిలాగే అంటారు. నా జీవితం ఎలాగో పాడయింది. నా మూలంగా నీ బతుకు పాడవకూడదనే యిదంతా సహిస్తున్నాను. రేపు నీ పెళ్లి ఈ కారణాలవల్ల పాడైతే బాధ పడాల్సిందాన్ని నేనే కదా అందుకే యింతా ఆలోచన..."

"అమ్మా స్టాపిట్, నిన్ను నీ మొగుడు కొట్టి హింసిస్తుంటే పోలీస్ కంప్లైంట్ యివ్వడానికి నా పెళ్లికి సంబంధం ఏమిటమ్మా... ఇదిగో యిన్ని మాటలొద్దు. ముందు నీవు వస్తావా నన్నెళ్లి కంప్లైంట్ చేసి రమ్మన్నావా. కోపంగా అంది. ఏం చెయ్యను అన్నట్టు నిస్సహాయంగా చూసింది రమణి.

'చూడమ్మా శ్వేత, పోలీసులదాకా ఎందుకు. ముందు ఆయనతో సామరస్యంగా చర్చించి చూద్దాం'

"అదంతా ఎప్పుడో అయిందాంటీ. ఆయనకిపుడు ఉద్యోగం లేదు. డబ్బు లేదు. తాగుడు లేకుండా వుండలేరు. మళ్లీ యింట్లో చేరడానికీ వేషాలు-యింట్లో చేరి మళ్ళీ కాల్చుకుతినడం మొదలవుతుంది. మా ఇద్దరి సంపాదన మీద ఆయన కళ్లుపడ్డాయి. ఎంత తండ్రి అయినా ఇలాంటి తాగుబోతుని

ఎలా భరిస్తాం ఇంట్లో మేం వుంచుకోలేదని ఉక్రోషం, కోపం. డబ్బివ్వలేదని ఏడుపు. ఆ కోపం అమ్మమీద చూపించి కొడ్తున్నాడు. నేను నీ మొగుడ్ని మనం యింకా డైవర్సు తీసుకోలేదు. నాకీ యింట్లో స్థానం వుంది. అధికారం వుంది. పొమ్మనే మాట యితే నా కూతుర్ని తీసుకుపోతాను అంటూ గొడవకి దిగాడు. కూతుర్ని తీసుకుపోవడానికి నేనేం మైనర్ని కాదు మేజర్ని. నీవసలు నాతండ్రివని చెప్పుకోనే చెప్పుకోను. నువ్వేం చేస్తావో చేసుకో, మా జోలికి వస్తే పోలీసు కంప్లైంట్ యిస్తానని బెదిరించా, నన్నేం చేయలేక అమ్మ చెంప బద్దలు కొట్టి, గోడకేసి తలకొట్టి తోసి పారిపోయాడు. ఇంకా ఇలాంటివాడ్ని

క్షమించి వదిలేయాలా. పరువుకోసమో, నా భవిష్యత్తుకోసమో పెళ్లికోసమో ఇలాంటి వాడ్ని ఇంట్లో పెట్టుకోవాలా ఉక్రోషంగా అరిచింది.

'పోలీసు కంప్లైంట్ యిస్తామనుకో, ఏం చేస్తారు. మహా అయితే బెదిరించి రెండు రోజులు లాకప్‌లో పడేసి వదిలేస్తారు.'

'చాలు ఆ మాత్రం చాలు వాడు భయపడానికి, కనీసం కొన్నాళ్లయినా మా జోలికి రాడు పంతంగా అంది.

శ్వేత వాదించి తల్లిని లాక్కెళ్లినట్టే పోలీసు స్టేషన్‌కి తీసుకెళ్లింది. 'ఈ దెబ్బలు ఇలాగే వుండగా కంప్లైంట్ చెయ్యాలి. అంటీ మీరు వస్తారా, మూడో మనిషి వుంటే కేసుకి బలం' అంది. ముగ్గురం వెళ్లాం.

పోలీసు స్టేషనులో యినస్పెక్టరు ఆశ్చర్యంగానే చూశాడు మమ్మల్ని 'చెప్పండి మేడం ఏంటి సంగతి' అన్నాడు రమణి మొహాన్ని చూస్తూ. 'కంప్లైంట్ యివ్వడానికి వచ్చాం. ఈవిడ్ని కొట్టి గాయపరిచిన అతని మీద కంప్లైంట్ రాసుకోండి'. 'అతను ఎవరు మీకేం అవుతాడు. తెల్సినవాడా...' యినస్పెక్టరు కుతూహలంగా, మరికాస్త అనుమానంగా చూస్తూ అడిగాడు.

"అతను ఆవిడ భర్త. మాజీ భర్త. వారిద్దరూ విడిపోయి పదేళ్లయింది. శ్వేత ఎంతవరకు చెప్పాలో అంతవరకు చెప్పింది. యినస్పెక్టరు ఓ కాగితం ముందుకు తోసి 'కంప్లైంట్ రాసివ్వండి. ఈవిడ పేరు వివరాలు, మీ అడ్రసు అతని పేరు, అడ్రసు, ఫోటో వుంటే అన్ని ఇవ్వండి. అంటూ రమణి వంక తిరిగి ఏమ్మా, భర్త అంటున్నారు మీరు చూస్తూ చదువుకున్న వారులా వున్నారు. మరి ఇదంతా ఏమిటి, అసలు గొడవేమిటి?" చదువేం ఖర్మ, పన్నెండు వేలు తెచ్చుకుంటున్న బ్యాంకు ఉద్యోగి నేనన్నాను. 'ఈ పెళ్ళాలని చితకబాదడం ఏదో అట్టడుగు వర్గాలలోనే అనుకుంటున్నాను. మీలాంటి వారికి... ఎందుకమ్మా కొట్టాడు. వివరాలు చెపితే ఎఫ్.ఐ.అర్. రాసుకోడానికి వీలుంటుంది'. రమణి తలదించుకుంది. ఆవిడ దెబ్బలతో నల్లబడ్డ మొహం మరింత నల్లబడింది. తల్లి తరపున శ్వేత కంప్లైంట్ రాసిచ్చి తల్లిచేత సంతకం పెట్టించి యినస్పెక్టరు అడిగిన వివరాలకి జవాబు చెప్పింది. "ఇలా, మీలాంటి వాళ్ళు వచ్చి కంప్లైంట్ యివ్వడం చాలా అరుదు. అందుకే ఆశ్చర్యంగా వుందమ్మా, మధ్యతరగతి మెంటాలిటి. పురువుకోసం పాకులాడుతారు... కాగితం పుచ్చుకుంటూ అన్నాడు." అతని అడ్రసు యివ్వలేదు మీరు' అన్నాడు.

'ఏమో ఎక్కడుంటాడో ఎవరికి తెలుసు. ఉద్యోగం, యిల్లు అది వుంటే గదా...'

అయితే కష్టమేనమ్మా వెతకడం.. సరే, మా ప్రయత్నం మేం చేస్తాం. ఫొటో యిచ్చారుగా, మళ్లీ మీ ఇంటి వైపు వస్తే మాత్రం వెంటనే ఫోను చెయ్యండి.”

‘సార్, ఎలాగైనా ఒక్కసారి అతన్ని బాగా బెదిరించి మళ్లీ మా జోలికి రాకుండా చెయ్యాలి. నెల రెండు నెలలకి వస్తుండడం, డబ్బులిచ్చే వరకు ప్రాణాలు తీసి, యివ్వందే కదలడు. చేతిలో డబ్బు పడకపోతే కొడ్తాడు. ఈ పీడ వదిలేట్టు చూడాలి’-శ్వేత అంది.

‘దొరకనీండి, లాకప్‌లో పడేసి నాలుగుతంతే దొరికొస్తాడు... మనిషి దొరకాలి ముందు - వాడి పని పడతా, మీరెళ్లి రండమ్మా, ఇన్‌ఫర్‌మేషన్ దొరకగానే ఫోను చేస్తాం’ అన్నాడు మర్యాదగా-మనిషి మంచి వాడిలాగే వున్నాడు అందులో కాస్త చదువుకుని ఉద్యోగం చేస్తున్న స్త్రీలు వచ్చి కంప్లైంట్ చేయడంతో మర్యాదిచ్చాడు అనిపించింది.

ఓ పదిరోజుల తరువాత ఎక్కడో పూరి కొంపల ఏరియాలో చీప్ లిక్కర్ తాగుతూ డబ్బీయకపోతే షాపువాడు పట్టుకుతన్నాడు. పోలీసులకి పట్టిచ్చాడుట. రమణి కంప్లైంట్ ఆధారంగా అతన్ని లాకప్‌లో పడేసి నాలుగు బాది మళ్లీ మా జోలికి వెడితే శాశ్వతంగా జైల్లో పడేస్తాం అని బాగా తన్ని బెదిరించాడట. యినస్పెక్టరు ఫోను చేసి చెపితే శ్వేత “పీడవదిలింది కొన్నేళ్ల వరకైనా మన జోలికిరాడు”అంది.

రమణికి నాకు ఈ సంఘటన తర్వాత స్నేహం కుదిరింది. కష్టసుఖాలు చెప్పుకోవడం, రాకపోకలు ఎక్కువైంది. ‘ఏమిటో’ నాకు దీని పెళ్లి అయిపోతే నిశ్చింత మంచి సంబంధాలు మీకే మన్నా తెలిస్తే..’ అనబోతుంటే శ్వేత గయ్‌మంది. ‘అమ్మా నీవూరుకో, నాకెవరూ సంబంధాలు చూడక్కరలేదు. అసలు నాకు ఈ పెళ్లి అంటేనే అసహ్యం అనిపిస్తుంది. చేసుకున్న వాళ్లు ఎంత సుఖపడ్తున్నారో చూస్తున్నాగా’ బాగుంది. ‘అందరదృష్టం నాలాగే వుంటుందా. అన్యోన్యంగా వున్న వాళ్లెంత మందిలేరు’ అంది రమణి” ఓ తోడు, సహచర్యం, ఇల్లు, సంసారం కావాలని నాకిప్పుడేం అనిపించడంలేదు. అనిపించినపుడు ఆలోచిద్దాంలే...’ నిర్లక్ష్యంగా అంది.

“ఇప్పుడిలాగే అంటావులే. యింకో మూడు నాలుగేళ్లు పోతే’ హాస్యంగా అన్నాను. ‘నా భయం అదేనండి. పెళ్లీడు దాటిపోతే సంబంధాలు సరి అయినవి దొరకకపోతే. ‘కూతరు వింటుందని నెమ్మదిగా అంది రమణి - ‘చూద్దాం లెండి, ఇంకా మరీ వయసు దాటిపోలేదుగా’ అన్నాను ధైర్యం చెపుతూ.

ఓ రెండేళ్లు గడిచాయి. రమణికి కూతురి పెళ్లి గురించి ఆరాటం ఎక్కువైంది. పేపర్లలో ప్రకటనలకి సరిపోయినవాటికి అప్లై చేసేది. వచ్చిన వాటిలో నచ్చిన వాటికి

జవాబు లిచ్చేది వివరాలతో. ఆరాసిన నలుగురైదుగురిలో ముగ్గురు తండ్రి వివరాలు రాయలేదు రాయమని కోరారు. 'చూశారా. పెళ్లి అనే సరికి ప్రతి వాళ్లు తండ్రి గురించి అడుగుతారు అంది రమణి నాతో. 'ఫ్రాంక్‌గా రాయండి. విడిపోయాం' అని అలారాస్తే యిద్దరు మళ్లీ జవాబివ్వలేదు. ఒకరు వాళ్ల అబ్బాయికి పెళ్లి కుదురిందని రాసేసారు. 'చూశవా నే చెప్పలేదు. యిప్పటికయినా తెల్సిందా మన సమాజం ఎలాంటిదో' రమణి కూతురు ముందు ఉత్తరాలు పడేసి విరక్తిగా అంది. శ్వేత ఎగిరిపడింది. 'నాకు తెలియకుండా అసలు నిన్నెవరు ఈ పనులు చేయమన్నారు".

'ఎవరు చేయమనడం ఏమిటి, తల్లిగా నీ పెళ్లి నా బాధ్యత'.

'నీకేం ఆ బాధ్యత అక్కరలేదని యిది వరకే చెప్పాను. మళ్లీ ఇలాంటి పిచ్చి పనులు చేయకు' ఉత్తరాలు కసిగా చింపేసింది.

"యిప్పుడిలాగే అంటుంది. తరువాత దాని పెళ్లికాకపోవడానికి నేనే కారణం అనుకుంటుందని నాకు భయంగా వుంది. పెళ్లి కాకుండా వుండిపోయిన అమ్మాయిలు చాలామంది పెళ్లికాకపోవడానికి తల్లితండ్రులే కారణం అని నానామాటలు అనే వాళ్లని చూశాను. యిదీ అలా నా మీద శత్రుత్వం పెంచుకుంటుందేమో... దిగులుగా అంది రమణి. రమణి అన్నదీ నిజమే. ఏ కారణం చేత పెళ్లికాక పోయినా ఆ విసుగు కోపం యిట్లా తల్లిమీద చూసే కూతుళ్లని నేను చూశాను. తల్లీ కూతుళ్లా వీళ్లు అనేటంత దెబ్బలాటలు విన్నాను స్వయంగా. ఆ మాట నేననలేదు రమణి మరీ దిగులుపడ్తుందని.

మరో రెండేళ్లు గడిచాయి. యిరవై ఏడు నిండాయి శ్వేతకి. తల్లికూతుర్లిద్దరి మధ్య పెళ్లి గురించి వాదనలు, దెబ్బలాటలు ఎక్కువయ్యాయి. శ్వేత ఆ మధ్య తన కొలీగ్ అంటూ ఓ అబ్బాయిని యింటికి రెండు మూడు సార్లు తీసుకొచ్చింది. రమణి ఆనందపడింది. అబ్బాయి బాగానే వున్నాడు. అతన్ని చేసుకుంటుందేమోనని సంబరపడింది. కాని, ఓ రెండు మూడు నెలల తరువాత ఏమయిందో గాని ఆ అబ్బాయి రావడం మానేసాడు. శ్వేత కాస్త దిగులుగా, అన్యమనస్కంగా ఉండేది. అతని మీద ఆశపెట్టుకుందేమో, ఇద్దరి మధ్య ఏమన్న గొడవ జరిగిందేమో దాంతో శ్వేత మూడ్ పాడయి వుంటుంది అనుకున్నాం మేమిద్దరం.

ఉన్నట్టుండి ఓ ఆరేడు నెలల తరువాత పదినెలల పాపని ఓ అనాథాశ్రమం నించి తీసుకొచ్చింది. ఎప్పుడు అప్లై చేసిందో, ఎలా మాట్లాడి కుదుర్చుకుందో మాకెవరికీ చెప్పకుండానే పాపని తీసుకొచ్చింది. తల్లిని బలవంతంగా వాలంటరీ రిటైర్‌మెంటు చేయించింది . పాపని చూసుకోవాలంటూ యిదేమిటే, పెళ్లికాలేదు ఈ పిల్లేమిటే నీకు,

పెళ్లిచేసుకుని పిల్లల్ని కనమన్నానేగాని యిలా పెంచుకోవాల్సిన అవసరం ఏమిటి అంటూ లబలబ లాడింది రమణి. తల్లిని మాట్లాడనివ్వలేదు శ్వేత. 'అమ్మా, అమ్మాయి తల్లిని, భరించి చేసుకోడానికి ఏ మగాడు ముందుకు రాడు కాదమ్మా, నా తల్లిని భరించని విడ్ని నే చేసుకోను, నిన్ను వదులుకోలేను గదా. యిక నీవు నాకు తోడు, నేను నీకు తోడు, నాతోడు పాప, నీతోడు నాకు చాలమ్మా, నాకీ పెళ్లివద్దు"

మనకు పాప ఆసరా. ఓ అనాథ పిల్లకి మనం ఆసరా, నాకో తోడు, యిల్లుం డాలన్నావు. తోడు నీవున్నావు. ఇల్లుంది. పిల్లుంది. ఉద్యోగం ఉంది. యింక మనం ఎవరి గురించి ఆలోచించనక్కరలేకుండా బతికేయచ్చమ్మా-' అంది పాపని ముద్దు పెట్టుకుంటూ- శ్వేత పెళ్లి ఎందుకు చేసుకోలేదో అర్థం అయి తల్లిపట్ల ఆమెకున్న ప్రేమని మెచ్చుకోకుండా వుండలేకపోయాను. కాని కన్న తల్లి రమణి కూతురు అలా మిగిలిపోవాలని కోరుకోదు కదా! ఏమయినా ఈ కాలం ఆడపిల్లల మనోనిబ్బరాన్ని ఆత్మాభిమానాన్ని ఆత్మవిశ్వాసాన్ని మెచ్చుకోవాల్సిందే!

◆ శ్రీలేఖ మాసపత్రిక, జులై 2002